క్లుప్తంగా

వాహనాల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా, గోపన్‌పల్లి చౌరస్తాలో ఆదివారం ఎస్సై మోహన్‌రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహన ధ్రువ పత్రాలు పరిశీలించారు. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించుకోవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం బాధితులకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో తిరుగుతూ బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు షౌకత్ అలీ, రాంచంద్రం, సంజీవులు, మేకల రాజు, రామస్వామి, సంజీవరెడ్డి, సిద్ధిరాంరెడ్డి, అఖిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించిన తాపీమేస్త్రి కుమార్తె



ఎల్లారెడ్డి: సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన యువతి బయ్యని శిరీష రెండు ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు పొందారు. గ్రామంలోని నిర్మల-సుధాకర్ దంపతుల మొదటి సంతానమైన బయ్యని శిరీష ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం పొంది విధులను నిర్వర్తిస్తుండగా, ఇటీవల ప్రకటించిన గ్రూప్-4 ఫలితాలలో సైతం విద్యాశాఖలో ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాపీమేస్త్రీ పనులు చేసే తండ్రికి కూతురు మంచి ఉద్యోగం సాధించడంతో అందరు అభినందించారు.

అందుబాటులో శనగ విత్తనాలు

బాన్సువాడ రూరల్: కోనాపూర్ రైతువేదికలో 100 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కోనాపూర్ క్లస్టర్ ఏఈవో కొండ మీనా తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో ఈసారి ఎండాకాలం శనగ పంట సాగు చేయాలని, ఆసక్తి ఉన్న రైతులు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ప్రభుత్వం 15 కేజీల బస్తాను 100 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తోందన్నారు. ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం జిరాక్స్‌తో రైతువేదికలో సంప్రదించాలన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నేషనల్ లెవెల్ కరాటే కుంగ్ ఫూ అండ్ టైక్వాండో చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో మహమ్మద్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. మహేశ్వరి, గాయత్రి, సోనీలు బంగారు పతకాలు సాధించగా, నందిని , సింధు వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రాజ్ తెలిపారు. కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థినులను ఆయన అభినందించారు.

రేపు కరెంటు సరఫరాలో అంతరాయం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని అన్ని గ్రామాల ఫీడర్లకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని ఏఈ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రిఫేజ్ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొనసాగుతున్న సర్వే

బీబీపేట: సమగ్ర కుటుంబ సర్వే బీబీపేట మండలంలో ఇప్పటివరకు 75 శాతం పూర్తి అయిందని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిగిలిన 25 శాతం సర్వే మరో మూడు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మొత్తం 9,745 కుటుంబాలకు 6,300 కుటుంబాలు పూర్తి అయ్యాయని మిగిలిన వాటిని పూర్తి చేస్తామన్నారు. అలాగే ఆన్‌లైన్ ఎంట్రీ కోసం 27 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని వారికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 20 నుంచి ఆన్‌లైన్ ఎంట్రీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సర్వేకు సహకరించాలని కోరారు.

నిఘా వ్యవస్థ పదిలమేనా..?

- మండల వ్యాప్తంగా పని చేయని నిఘా నేత్రాలు
- గ్రామాల్లో కొరవడిన పోలీసుల నిఘా
- ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఉన్నా లేనట్లే
- బీబీపేట వార సంతలో పేట్రేగిపోతున్న సెల్‌ఫోన్ దొంగలు
- పట్టించుకోని పోలీసు అధికారులు



బీబీపేట ప్రధాన చౌరస్తాలో పని చేయని కెమెరాలు



వారంతపు సంతలో పని చేయని సీసీ కెమెరా

బీబీపేట: ప్రమాదాల నివారణకు, చోరీ కేసుల్లో నిందితుల గుర్తింపు కోసం ప్రధానంగా ఉపయోగపడేవి సీసీ కెమెరాలు. సీసీ కెమెరాలతో చాలా చోట్ల ప్రమాదాలను గుర్తించడంతో పాటు నేరస్తులను పట్టుకోవడానికి కీలకంగా ఉపయోగపడతాయి. అలాంటి సీసీ కెమెరాలు మండల వ్యాప్తంగా మూలనపడ్డాయి. పట్టించుకోవాల్సిన పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జన సంచారం ఉన్నచోట, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాల్సి ఉండగా సీసీ కెమెరాల పట్ల నిర్లక్ష్యం చేస్తూ పోలీసులు నిద్రపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. దొంగతనాలు, కొట్లాటలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించాల్సిన అధికారులు సైతం మొద్దు నిద్ర పోతున్నారని వాపోతున్నారు.

పోలీసులకు పట్టింపేది ?

ఏదైనా జరగరాని పెద్ద ఘటన జరిగితే ఎవరు బాధ్యులు అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే పలు ఘటనలు జరిగినప్పుడు పరిశీలించాల్సిన సీసీ కెమెరాలు లేకపోవడంతో కేసులను పక్కదోవ పట్టించారని పలువురు విమర్శిస్తున్నారు. సీసీ కెమెరాలపై కనీసం దాతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపార సముదాయాల వారికి అవగాహన కల్పించడం లేదు.

73కు పని చేస్తున్నవి 17 మాత్రమే

మండల వ్యాప్తంగా మొత్తం 73 సీసీ కెమెరాలు బిగించారు. అందులో 17 మాత్రమే పనిచేస్తున్నాయి. నిఘా వైఫల్యం ఎంత వరకు ఉందో ఈ గణాంకాలు మనకు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి.

త్వరలోనే రిపేర్ చేయిస్తాం



మండలంలో కొన్ని చోట్ల సీసీ కెమెరాలు భారీ వర్షాల కారణంగా చెడిపోయాయి. త్వరలోనే పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకుంటాం. మండల వ్యాప్తంగా ప్రజలు, వ్యాపార సముదాయాలవారు ముందుకు వచ్చి మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలి.

– ప్రభాకర్, ఎస్సై, బీబీపేట

మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

గ్రామం	సీసీ కెమెరాలు	పనిచేస్తున్నవి	పనిచేయనివి
బీబీపేట	31	09	22
ఇస్సానగర్	04	00	04
జనగామ	00	00	00
సీతారాంపల్లి	06	06	00
మల్కాపూర్	04	00	04
మాందాపూర్	04	00	04
శివారురాంరెడ్డిపల్లి	04	00	04
తుజాల్‌పూర్	04	00	04
ఉప్పర్‌పల్లి	06	00	06
యాడారం	10	02	08
మొత్తం	73	17	56

మండల వ్యాప్తంగా పని చేయని ప్రదేశాలు

మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరాలు ఏడాది కాలంగా మూలనపడి ఉన్నాయి. వాటికి కనీసం మరమ్మతులు చేయాల్సిన పోలీసులు వాటిని పట్టించుకోకపోవడంతో ప్రధాన చౌరస్తాలో జరిగే ఘటనలు, పలు గొడవలు, సభలు, ధర్నాలు కనిపించకుండా పోవడమే కాకుండా కీలక ఆధారాలను కోల్పోతున్నారు. అంతే కాకుండా బీబీపేట మండలం నాలుగు జిల్లాల కూడలి. ఇతర జిల్లాల నుంచి రాకపోకలు సాగడానికి బీబీపేటనే ప్రధాన కూడలి. అలాంటి కూడలిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కొన్ని నేరాలను అదుపు చేయలేకపోతున్నారు. మండలంలో పది గ్రామాలు కాగా ఏ ఒక్క గ్రామంలో కూడా పూర్తిగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఆదివారం జరిగే వారాంతపు సంతలో ప్రతి వారం సెల్‌ఫోన్లు పదుల సంఖ్యలో అపహరిస్తున్నారు. కనీసం వాటి అదుపునకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కూడా మూలనపడి చాలా నెలలవుతుంది. దీంతో దొంగలు తమ పని స్వేచ్ఛగా చేసుకుంటున్నారు.

విద్యార్థులున్నా..హాజరు శాతం సున్నా

- తరగతులకు హాజరుకాని విద్యార్థులు
- పిల్లలను కళాశాలకు పంపాలని కోరుతున్న అధ్యాపకులు



తరగతులకు హాజరు కాని విద్యార్థులు

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఉన్నా .. విద్యార్థులు లేని పరిస్థితి ఏర్పడింది. విద్యాబోధనకు డిప్యుటేషన్‌పైన అధ్యాపకులు వస్తున్నా విద్యార్థులు మాత్రం తరగతులకు హాజరు కావడం లేదు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి, విద్యార్థుల నుంచి అడ్మిషన్లు స్వీకరించారు. ఆ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులు ఉన్నాయి. జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేరిక కోసం అధ్యాపకులు గ్రామాలను చుట్టేయడంతో 18 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అలాగే జూనియర్ కళాశాలకు రూ.లక్షల విలువ చేసే ల్యాబ్ మెటీరియల్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతేకాకుండా ఆయా తరగతులకు సంబంధించి పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసింది. ల్యాబ్ మెటీరియల్, పాఠ్య పుస్తకాలు వచ్చినా విద్యార్థుల జాడ మాత్రం కరువైంది. నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల మొదటి రోజు నుంచి తరగతులు ప్రారంభం అయ్యాయి. మొదట్లో ఇద్దరు బాలికలు వారం రోజుల పాటు తరగతులకు హాజరయ్యారు. వారం రోజుల తర్వాత ఆ ఇద్దరు బాలికలు సైతం తరగతులకు హాజరు కావడం లేదు. విద్యా బోధనకు కోసం పిట్లం కళాశాల నుంచి అధ్యాపకులు వస్తున్నారు. కాని ఆ కళాశాలలో విద్యార్థుల జాడ కరువైంది. దీంతో అధ్యాపకులు తరగతి గదుల్లో సెల్‌ఫోన్లతో కాలయాపన చేయాల్సి వస్తోంది.

కళాశాలకు పిల్లలను పంపించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు ఉన్నా విద్యార్థులు రావడం లేదు. కళాశాలలో అడ్మిషన్లు పొందిన పిల్లలను తల్లిదండ్రులు తరగతులకు పంపించాలని కోరుతున్నాం.

– షేక్ సలాం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

కార్యకర్తలే పార్టీకి శ్రీరామ రక్ష

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సింధే

నిజాంసాగర్(జుక్కల్): కార్యకర్తలు రాజకీయ పార్టీలకు శ్రీరామ రక్షని, వారిని రక్షించుకోవడం నాయకుల బాధ్యత అని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులకు అధికారం, పదవులు ముఖ్యం కాదని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు ముఖ్యమన్నారు. అధికారం లేకున్న పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. ఓటమి తెలిపిన గుణపాఠంతో గెలుపు కోసం ముందుకు వెళ్లాలని రానున్న పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, ఉమ్మడి మండలాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్‌అలీ, నాయకులు గంగారెడ్డి, లింగాల. రాంచందర్, సంగమేశ్వర్‌గౌడ్, పున్న నారాయణ, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



నిజాంసాగర్(జుక్కల్): మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఘనస్వాగతం పలికారు. స్థానిక విషయాలపై చర్చించారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం చేశారు.

మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇంకా దేశంలో మహిళలపై దాడులు ఆగడం లేవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు మౌలాంబీ, లక్ష్మి, గంగామణి, సుజాత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల తల్లిదండ్రులకు వరం

- వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న సలహాదారు పోచారం, పక్కన సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరంలా మారిందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ రూరల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు పేదింటి ఆడపిల్లలకు పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉందని, గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు ఆడపిల్లల తల్లిదండ్రులకు వరంలా మారాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాల సేకరణ



విరాళం అందజేస్తున్న సల్ల మల్లయ్య

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు విరాళాల సేకరణ చేపడుతున్నారు. విరాళాల సేకరణ సంతృప్తికరంగా ఉండడంతో త్వరలో ఆలయం వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు దివిటి రమేశ్ తెలిపారు. విరాళాలు సేకరించిన డబ్బులతో 60 గుంటల భూమిని ఆలయం వద్ద కొనుగోలు చేశారు. ఆలయ అభివృద్ధి కోసం గౌడ సంఘం నుంచి రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. అలాగే సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి రూ.లక్షా 11 వేలు, రైస్‌మిల్లు యజమాని రవి కుమార్ గుప్తా రూ.లక్షా 11వేలు, ముప్పిడి నగేష్ రూ.51వేలు, దశరథం రూ.51 వేలు, వంజరి ఎల్లమయ్య రూ.51 వేలు, అవుసుల లక్ష్మన్ రూ.51వేలు, జలరాం హోటల్ రూ.51వేలు, ధరమ్‌సింగ్ రూ.51వేలు, రూ.25 వేలు, కౌడ రవి, లక్ష్మీనారాయణ రూ.25 వేలు, రూ.21వేలు సల్ల మల్లయ్య, గుజ్జరి మారుతి, దివిటి అశోక్, కొత్త చిన్న దుర్గయ్య, డాక్టర్ భాస్కర్, మౌలానా మేస్త్రీ, శంకర్ పంతులు, తదితరులు రూ. 21వేల చొప్పున విరాళాలు అందజేశారు. అలాగే పలువురు రూ. 11వేల చొప్పున విరాళాలు ఇచ్చారు. ఆదివారం వరకు రూ. 22 లక్షల వరకు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆలయం వరకు రూ.కోటితో బీటీ రోడ్డు మంజూరు చేసి పనులు ప్రారంభించారు.

చిన్నారులను ఆధ్యాత్మికం వైపు నడిపించాలి



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: చిన్నారులను ఇప్పటి నుంచి ఆధ్యాత్మికం వైపు నడిచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని హైదరాబాద్‌కు చెందిన సైకాలజిస్టు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నేడు జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మంచి వారితోనే స్నేహం చేయాలని అన్నారు. ఏదైనా పని చేయాలంటే ఓపిక చాలా ముఖ్యమని, విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. సమయాన్ని వృథా చేయవద్దని, సమయం దాటితే తిరిగి రాదని అన్నారు. కింగ్స్ యూత్ అధ్యక్షుడు విజయ జెట్టి, ఉపాధ్యక్షుడు మారిశెట్టి హనుమాన్లు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులవి అసత్య ఆరోపణలు



పాల్వంచలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మాచారెడ్డి: కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అసత్యాలని బీజేపీ జిల్లా నాయకుడు పొన్నాల వెంకట్ రెడ్డి కొట్టిపారేశారు. ఆదివారం పాల్వంచలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు ఏంటో ఎమ్మెల్యే అడ్డుకున్న పనులేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆగడాలు, భూకబ్జాలు, అక్రమ వసూళ్లు, రౌడీయిజాన్ని ఆయన అడ్డుకుంటున్నారని అన్నారు. మింగుడు పడక ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎంత మంది అధికారులను వేధించారో చెప్పాలని సవాల్ విసిరారు. పాల్వంచ తహసీల్దార్ ఎలాంటి వాడో మండల ప్రజలకు తెలుసని ఘాటుగా స్పందించారు. అసమర్థ అధికారి వల్ల 92 కల్యాణ లక్ష్మి చెక్కులు ఆగిపోయాయని అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలే సరైన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. మండల శాఖ అధ్యక్షుడు అనిల్, జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు తోట బాలరాజు, నరసింహ చారి, మధునాల శ్రీనివాస్ గౌడ్, రాఘవపురం శ్రీనివాస్, సామగంజి నరేష్, సత్యం, భాస్కర్ రెడ్డి, తదితరులున్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు



మెంగారంలో బోనాల ఊరేగింపులో మహిళలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారం గ్రామానికి చెందిన ఆదివాసి నాయక్‌పోడ్ కులస్తులు ఆదివారం బద్ది పోచమ్మకు బోనాలు సమర్పించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇంటింటికి బోనం తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో బోనాలు ఊరేగించారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ అధ్యక్షుడు పుట్ట దత్తు, బాలు, రాములు, బాలసాయిలు, బాలపోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సంక్షిప్తం

వధూవరులకు ఆశీర్వాదం



భిక్కనూరు: మాజీ ఎంపీపీ బల్యాల రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ కుమార్తె అలేఖ్య వివాహం కామారెడ్డికి చెందిన నరేష్‌తో ఆదివారం జరిగింది. ఈ వివాహానికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, హైకోర్టు న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి, ఎంపీడీవో రాజకిరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ సతీమణి నఫీజ్ పర్వీన్, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, కాంగ్రెస్ నాయకులు జమున రాథోడ్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరై ఆశీర్వదించారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో డీసీసీ అధ్యక్షుడు



కామారెడ్డి టౌన్: మహారాష్ట్రలో జరుగుతున్న ఎన్నికలలో భాగంగా ఆదివారం దెగ్లూర్ నియోజకవర్గంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి నివృత్తి కాంబ్లీని, ఎంపీ అభ్యర్థి రవీంద్ర వసంత్‌రావ్ చవాన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

మాలల సింహ గర్జన జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్: డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహ గర్జన సభను జయప్రదం చేయాలని మాల సంఘం రాష్ట్ర నాయకుడు అయ్యాల సంతోష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, దళిత సంఘాలు భారీ సంఖ్యలో సభకు తరలిరావాలని కోరారు. నాయకులు రతన్‌కుమార్, మైసయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఓవైపు పంట నూర్పిళ్లు.. మరోవైపు విస్తరణ పనులు



బాన్సువాడ రూరల్: పంట పొలాల్లో నీళ్లు చేరి ఉండటంతో చాలాచోట్ల రైతులు పంట నూర్పిళ్లు రోడ్లపై చేస్తున్నారు. పంట ఉత్పత్తులతో రోడ్లు నిండిపోతున్నాయి. అదే సమయంలో జాతీయ రహదారి-765 విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రొక్లెయినర్లు, జేసీబీలు, మొరం టిప్పర్లతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పంటనూర్పిళ్లు, ధాన్యం బస్తాలు రోడ్లపై నుంచి రైస్‌మిల్లులకు తరలేవరకు నెల రోజుల పాటు రహదారి విస్తరణ పనులు నిలిపి వేయాలని ప్రజలు కోరుతున్నారు.